క్లుప్తంగా

ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణంలోని 3వ వార్డుకు చెందిన కే శ్రీనివాసులు, 14వ వార్డుకు చెందిన షేక్ షాహీనా, 16వ వార్డుకు చెందిన షేక్ ఖాసీం, షేక్ ఖాదర్‌బాషా, 22వ వార్డుకు చెందిన దివానం ప్రసాద్, 23వ వార్డుకు చెందిన వై గోపాలయ్య ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుల కుటుంబ సభ్యులను కంచి పరమేశ్వరరెడ్డి శనివారం పరామర్శించారు. రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. నరసింహరెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, పులిమి శైలజ, రమణమ్మ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



సంగం: సౌత్ ఇండియన్ సైన్స్ ఫెస్టివల్‌లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బుజ్జయ్య ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శనను శనివారం నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. జిల్లా సైన్స్ మ్యూజియం క్యూరేటర్ సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా హాజరై వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థుల నమూనాలను తిలకించి అభినందించారు. విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకుని భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. సైన్సు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



సంగం: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో విష్ణుసహస్ర నామ పఠనం ముగింపు రోజు సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. భక్తులు భజనలు చేశారు.

నేడు ముందస్తు సంక్రాంతి సంబరాలు

ఆత్మకూరు: పట్టణానికి చెందిన తెలుగుభారతి సేవా సమితి, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. పట్టణంలోని తూర్పువీధి అలఘునాథస్వామి ఆలయం వెనుకవైపున ఉన్న రైస్‌మిల్లు ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి సంబరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళలకు ముగ్గుల పోటీలు, కోలాటం పోటీలు, పాఠశాల విద్యార్థులకు శాస్త్రీయ సంగీత నృత్య పోటీలను నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. సంక్రాంతి విశిష్టతపై వక్తలు ఉపన్యాసించనున్నట్లు వివరించారు. రాత్రి 8 గంటలకు భారీ స్థాయిలో సంక్రాంతి విందు భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఓవెల్‌లో సైన్స్‌లాంచర్‌-2

కావలి: పట్టణంలోని రాజావీధిలో ఉన్న ఓవెల్ పాఠశాలలో సైన్స్ గెలాక్సీ లో భాగంగా సైన్స్ లాంచర్‌-2ను శనివారం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు 200కుపైగా ప్రాజెక్ట్ నమూనాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, వైద్యులు పీ శివప్రసాద్, నరేంద్ర ముఖ్యఅతిథులుగా హాజరై నమూనాలను తిలకించి విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపల్ ఐ శివయ్య, డీజీఎం శ్రీనివాసులు, ఏజీఎం జయదేవ్, హైస్కూల్ ఇన్‌చార్జి లత, ప్రైమరీ ఇన్‌చార్జి సుమలత, ప్రీప్రైమరీ ఇన్‌చార్జి రమ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీడీఓపై దాడి హేయం

కావలి: అన్నమయ్య జిల్లా గాలివీడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా పని చేస్తున్న జవహర్‌బాబుపై భౌతిక దాడులకు పాల్పడడం హేయమైన చర్య అని కావలి ఎంపీడీఓ సీహెచ్ శ్రీదేవి ఖండించారు. కావలి మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఆమె శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

రేపు వామపక్షాల నిరసన

కావలి: అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఈ నెల 30న కావలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపడుతున్నట్లు వామపక్ష నాయకులు శనివారం తెలిపారు. అంబేడ్కర్‌ను అవమానించేలా కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. అంబేడ్కర్‌ను అవమానించడమంటే రాజ్యాంగాన్ని అవమానించడమేనన్నారు. అమిత్‌షాను కేంద్రమంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా కావలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సాయంత్రం చేపడుతున్న నిరసన ప్రదర్శనలో ప్రజాస్వామ్యవాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సూపర్ చాయ్ మాస్టర్లు



- తేనీరు తయారీలో సిద్ధహస్తులు రాజస్థాన్‌వాసులు
- రంగు..రుచి..చిక్కదనానికి సమప్రాధాన్యం
- చాయ్ తాగితే అచ్చా అనాల్సిందే



కస్టమర్లకు టీ అందజేస్తున్న రాజస్థాన్‌వాసి

కావలి: ప్రపంచంలోని సర్వజనులు తాగేది ఏమి'టీ' అంటే ఠక్కున చెప్పే సమాధానం చాయ్. ఉదయం కడపులో కప్పు తేనీరు పడందే చాలామందికి దినచర్య మొదలవదు. కొందరైతే రోజుకు కనీసం నాలుగైదు సార్లు అయినా గరం గరం చాయ్ తాగేస్తుంటారు. ఇక టీ ప్రేమికులైతే ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఒక కప్పు వేడి చాయ్ లేని రోజును వారు అస్సలు ఊహించుకోలేరు. అంతలా నిత్యజీవనంలో అల్లుకుపోయిన తేనీరును ఒక్కొక్కరు ఒక్కోలా ప్రిపేర్ చేస్తుంటారు. కానీ రుచికరమైన చాయ్ తయారీలో సిద్ధహస్తులు రాజస్థాన్‌వాసులు.

30కుపైగా టీ స్టాళ్లు

జిల్లాలో రాజస్థాన్‌కు చెందిన వారు వేల సంఖ్యలో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో టీ స్టాళ్లను రాజస్థాన్‌వాసులు నిర్వహిస్తున్నారు. కావలి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో సుమారు 30కుపైగా రాజస్థాన్ టీ స్టాళ్లు ఉన్నాయి. రాజస్థాన్‌వాసులు తేనీరు తయారీలో రంగు..రుచి..చిక్కదనానికి సమప్రాధాన్యం ఇస్తారు. అందుకే రాజస్థాన్‌వాసుల టీ స్టాల్ కనిపిస్తే చాలు..మంచి టీ దొరుకుతుందనే నమ్మకంతో ప్రతిఒక్కరూ వెళ్లి తాగుతుంటారు. అక్కడ తాగితే రుచిగా లేవు..పలుచగా ఉన్నాయి..స్ట్రాంగ్‌గా లేవు..ఇలాంటి విమర్శలు వినిపించవు. రంగు, రుచి, చిక్కదనంతో ఉండి సంతృప్తిని ఇస్తుంది.

తయారీ ప్రత్యేకం

రాజస్థాన్‌వాసుల చాయ్ తయారీ విధానం చాలా ప్రత్యేకంగా ఉంటుంది. టీ తయారీలో అల్లం, యాలకలు, దాల్చిన చెక్కను కచ్చితంగా వాడుతారు. పాలను బాగా మరగకాచి టీని తయారు చేసి పొగలు కక్కే కప్పును మన చేతిలో పెడతారు. టీ స్టాల్‌కు వచ్చే కస్టమర్లతో చాలా సాన్నిహిత్యంగా మెలుగుతూ వ్యాపారం చేయడం వీరి విలక్షణశైలి. స్థానికుల మాదిరిగా కాకుండా కొత్త విధానంలో టీ తయారు చేస్తూ టీ సేవించే వారిని ఆకట్టుకుంటారు. వారు తయారు చేసే చాయ్ ప్రత్యేకంగా ఉండడం వల్ల రాజస్థాన్‌వాసులు సూపర్ టీ మాస్టర్లుగా గుర్తింపు తెచ్చుకున్నారు.

జీవనోపాధి కోసం..

రాజస్థాన్ చెందిన ఎంతో మంది జీవనోపాధి కోసం జిల్లాకు వలస వచ్చి ఉన్నారు. అలా వచ్చిన వారిలో కొందరు కావలి పట్టణంలో టీ స్టాళ్లను ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. తొలుత చిన్న గదిని అద్దెకు తీసుకుని టీ స్టాల్‌ను ఏర్పాటు చేసుకుని వ్యాపారం ప్రారంభిస్తారు. అలాగే వారు ఉండడానికి కూడా చిన్న గదిని అద్దెకు తీసుకుంటారు. అలా జీవనం ప్రారంభించే వారు ఆ తరువాత స్థానికుల్లా మారిపోతుంటారు. స్థానికులు, కస్టమర్లతో స్నేహపూర్వకంగా మెలుగుతూ తమ వ్యాపారాన్ని కొనసాగిస్తారు. వేకువ జామున 4 గంటలకే టీ స్టాల్‌ను ప్రారంభించి రాత్రి 8 గంటలకు మూసేస్తారు. టీ స్టాల్‌లో పని చేసేందుకు రాజస్థాన్ నుంచే యువకులను పిలిపించుకుంటారు. స్టాల్ యజమాని, అతని వద్ద పని చేసే సహాయకులు అందరూ కలిసి చిన్నగదిలోనే సర్దుకుని ఉంటారు. గదిలో వంట చేసుకోవడానికి స్టౌ, వంట సామగ్రి, పడుకోవడానికి చాప దుప్పటి , ధరించే దుస్తులు మాత్రమే ఉంటాయి. అదనంగా ఏ వస్తువు కూడా ఉండదు. టీ వ్యాపారం ద్వారా సంపాదించే నగదును రాజస్థాన్‌లోని తమ కుటుంబసభ్యుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసేస్తుంటారు. చాలా సాధారణ జీవితం గడిపే రాజస్థాన్ టీ వాలాలు విభిన్న రుచులతో టీ ఇస్తున్నామనే భావనను స్థానికుల్లో ఏర్పడేలా చేసుకున్నారు. అంతేతప్ప టీ వ్యాపారం చేస్తున్నామనే భావనను కలిగించరు.

పదేళ్లుగా టీ స్టాల్ నిర్వహిస్తున్నా



కావలిలో పదేళ్లుగా టీ స్టాల్ నిర్వహిస్తున్నా. నన్ను రాజస్థాన్‌కు చెందిన వాడిగా ఎవరూ చూడరు. స్థానికుడిగానే భావిస్తారు. నా వద్దకు వచ్చే వారు ఎక్కువగా చిక్కటి పాలతో స్పెషల్ టీ చేసి ఇవ్వమని అడుగుతుంటారు. మరికొందరు అల్లం ఎక్కువగా వేసి పెట్టి ఇవ్వమంటారు. టీ స్టాల్‌కు వచ్చే వారు ఎలా అడిగితే అలా టీ పెట్టి ఇస్తాను. తాగిన తర్వాత నవ్వుతూ అచ్ఛాహై అంటారు. ఆ నవ్వే మమ్మల్ని పరాయి రాష్ట్రానికి చెందిన వ్యక్తులమనే భావన లేకుండా చేస్తుంది.

–రాజ్‌కుమార్, రాజస్థాన్ టీ స్టాల్ నిర్వాహకుడు, కావలి

రుచిగా ఉంటాయి



స్థానికులతో పోల్చితే రాజస్థాన్‌వాసుల తయారు చేసే టీ చాలా తేడాగా ఉంటుంది. వారు ఏమి వేసి తయారీ చేస్తారో కానీ తాగేటప్పుడు, తాగిన తర్వాత రుచికరమైనవి తాగామనే ఫీలింగ్ ఉటుంది. అందుకే టీ తాగాలనిపించినప్పుడు అందుబాటులో రాజస్థాన్ టీ స్టాల్ ఉంటే అక్కడికే వెళ్తా.

వేణు, కావలి.లోకల్ టీలకు రాజస

4 నుంచి వాలీబాల్ టోర్నమెంట్

సీతారామపురం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని జాలీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో జనవరి 4 నుంచి 6వ తేదీ వరకు సీతారామపురంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.20,116, ద్వితీయ బహుమతి రూ.10,116, తృతీయ బహుమతి రూ.5,116 నగదుతో పాటు షీల్డులు అందజేయనున్నట్లు చెప్పారు. టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఎంట్రీ ఫీజు రూ.600 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 83280 82308, 78930 61454 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

రేపు దివ్యాంగులకు ప్రత్యేక శిబిరం

చేజర్ల: మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం సోమవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత శనివారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ వైకల్య పరీక్షలు చేసి అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, తదితర ఉపకరణాలు అవసరమైన వారు సదరం సర్టిఫికెట్, రేషన్, ఆధార్ కార్డులు, రెండు ఫొటోలు తీసుకునిరావాలని కోరారు.

వింత వ్యాధితో జీవాలు మృత్యువాత

మర్రిపాడు: పడమటినాయుడుపల్లిలో వింత వ్యాధితో పదుల సంఖ్యలో జీవాలు మృత్యువాత పడుతున్నాయని జీవాల పోషకులు తెలిపారు. ఎన్ని మందులు వాడినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువైద్యాధికారులు స్పందించి జీవాలను కాపాడాలని వేడుకుంటున్నారు.

హైకోర్టు ముంగిటకు బోగోలు పంచాయతీ వివాదం

బిట్రగుంట: బోగోలు పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యుల మధ్యన నెలకొన్న వివాదం చిలికిచిలికి గాలివానగా మారింది. ఇటీవల పంచాయతీ సాధారణ సర్వసభ్య సమావేశం సందర్భంగా ఇద్దరు వార్డు సభ్యులు తన విధులకు ఆటంకం కలిగించారంటూ పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌జహీర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు పోలీసులు వార్డు సభ్యులు సూరపనేని శ్రీనివాసులు, గంగపట్ల సనమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శాఖాపరమైన విచారణానంతరం స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు. ఈ క్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉద్దేశపూర్వకంగా తమపై తప్పుడు కేసు పెట్టారంటూ బాధిత వార్డు సభ్యులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘుతో కలిసి జిల్లా కలెక్టర్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ బహిరంగ విచారణ చేపట్టగా ప్రత్యక్ష సాక్షులుగా పేర్కొన్న పంచాయతీ సిబ్బంది, ఇతర వార్డు సభ్యులు కూడా సమావేశం జరిగిన రోజు పంచాయతీ కార్యదర్శి విధులను అడ్డుకునేలా వివాదం జరగలేదని లిఖితపూర్వకంగా రాసిచ్చారు. దీంతో అధికారులు విచారణను ఎటూ తేల్చకుండా వదిలేశారు. అయితే వార్డు సభ్యులపై పోలీసులు నమోదు చేసిన కేసు మాత్రం విచారణలోనే ఉంది. దీంతో వార్డు సభ్యులు తమపై తప్పుడు కేసు పెట్టిన పంచాయతీ కార్యదర్శిపై తగిన చర్యలు చేపట్టాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. పంచాయతీ కార్యదర్శి తన అధికారాన్ని దుర్వినియోగం చేసి తప్పుడు ఫిర్యాదుతో తమపై అభియోగాలు నమోదు చేయించడంతో చట్టపరంగా, మానసికంగా ఇబ్బంది పడ్డామని హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. దీంతో రెండు, మూడు రోజుల్లో బోగోలు పంచాయతీ వివాదం కోర్టు ముంగిటకు చేరనున్నట్లుగా తెలిసింది.

హెల్మెట్‌ను విధిగా ధరించాలి



హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

కావలి: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్‌ను ధరించాలని కావలి డీఎస్పీ పీ శ్రీధర్ సూచించారు. పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్ ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తూ శనివారం పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎస్పీ పీ శ్రీధర్ ప్రారంభించారు. అనంతరం డీఎస్పీతో పాటు సీఐలు, ఎస్సైలు, పోలీసులు హెల్మెట్లు ధరించి బైక్‌లపై ట్రంక్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలవడం వల్లే ఎక్కువగా ద్విచక్ర వాహనచోదకులు మరణిస్తున్నారని తెలిపారు. తలకు హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని ప్రతిఒక్కరూ ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని సూచించారు. హెల్మెట్‌ను ధరించకపోతే మోటార్ వాహనాల చట్టం ప్రకారం జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి



సురేష్‌రెడ్డిని సత్కరిస్తున్న డీఎం శ్రీనివాసులు, అసిస్టెంట్ డీఎం కల్పనారెడ్డి

కావలి: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. కావలి బస్టాండ్ నుంచి కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి క్షేత్రానికి బస్సు సర్వీసును శనివారం ఆయన ప్రారంభించారు. తొలుత కావలి బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులు, బస్టాండ్‌లోని వ్యాపారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. డిపో మేనేజర్ కార్యాలయంలో ఆర్టీసీ సిబ్బంది, పట్టణ ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై ప్రతి శనివారం కావలి నుంచి కొండబిట్రగుంటకు బస్సును నడుపుతామని తెలిపారు. ప్రతి శుక్రవారం జొన్నవాడ కామాక్షితాయి సన్నిధికి కూడా బస్సును ప్రారంభిస్తామని చెప్పారు. కావలి నుంచి హైదరాబాద్, బెంగుళూరు నగరాలకు స్లీపర్ కోచ్ బస్సులను నడిపేందుకు ప్రయత్నిస్తామన్నారు. బస్టాండ్ ఎదుట ప్రైవేట్ బస్సులు నిలపకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు, రవాణాశాఖ అధికారులను కోరుతామన్నారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డిని కావలి డిపో అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రముఖులు సత్కరించారు. కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్లు కల్పనారెడ్డి, ఖాజామొహిద్దీన్, గంగు విజయకుమారి, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డీ రవిప్రకాష్, ప్రముఖ వస్త్ర వ్యాపారులు అమరా సుబ్బారావు, సీపీసీ సత్యం, బీఎంఎంఎస్ నాయకులు తోట్టెంపూడి ప్రసాదరావు, నూనె వ్యాపారి ఓరుగంటి వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు గుండ్లపల్లి భరత్‌కుమార్, పల్లపు చిట్టిబాబు, బ్రహ్మానందం, కమల, రంగారెడ్డి, రమణారెడ్డి, మందా కిరణ్ కుమార్, సవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

కలిగిరి: మండలంలోని తూర్పుదూబగుంటలో సాగు చేసిన ఆర్‌ఎన్‌ఆర్‌-15048, కేఎన్ఎం-1638 రకాలు నెల రోజుల్లోనే వెన్నుతీయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తూర్పుదూబగుంటలో ఏఓ సురేష్‌బాబు శనివారం పర్యటించి వరి పంటను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ రకాలకు పొడి వాతావరణం అవసరమన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరి త్వరగా వెన్నుకు వచ్చిందని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నాట్లు వేసిన తరువాత మొదటి దఫా ఎకరాకు ఒక బస్తా యూరియాను వినియోగించాలని సూచించారు. వారం తర్వాత మళ్లీ ఒక కట్టా యూరియా,అరకట్ట పొటాష్ వేయాలని సూచించారు. రైతులు జాగ్రత్తలు పాటిస్తే కొత్త పిలకలు వచ్చి దిగుబడులు వస్తాయని తెలిపారు.

లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలి

మర్రిపాడు: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని భారత విదేశీ మంత్రిత్వశాఖ డిప్యూటీ సెక్రటరీ, ఐఎఫ్ఎస్ అధికారి బుదుగు శ్రీనివాసులు అన్నారు. మండలంలోని నందవరం ఆదర్శ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు జయాపజయాలు సమానంగా తీసుకుని లక్ష్యసాధన వైపు మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. లక్ష్య సాధనలో తాను జీవితంలో ఎదుర్కొన్న అనేక ఘటనలను, వాటిని ఎదుర్కొన్న తీరును విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

సీసీకెమెరాలు ఏర్పాటు చేయండి

చేజర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో దాతల సహకారంతో సీసీకెమెరాలను ఏర్పాటు చేయాలని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ సూచించారు. చేజర్ల పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డును పరిశీలించి పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఎస్సై తిరుమలరావును ఆదేశించారు. అనంతరం మహిళా పోలీసులను అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. విధిగా హెల్మెట్ ధరించేలా ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఏఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

వర్షానికి నేలవాలిన వరి పంట పరిశీలన



వరికుంటపాడు: రబీలో పంటలు సాగు చేసిన రైతులు ఈక్రాప్ నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ వీ రవికుమార్ సూచించారు. శనివారం ఆయన తిమ్మారెడ్డిపల్లిలో పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బ తిన్న వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనకు ఈ నెల 31 తేదీ వరకు మాత్రమే గడువు ఉందని తెలిపారు. వరి పంటకు ఎకరాకు రూ.168 చొప్పున ప్రీమియం చెల్లించి బీమా చేసుకుంటే ప్రకృతి విపత్తులతో నష్టపోతే రూ.42వేలు పరిహారం అందుతుందని వివరించారు.

మన్మోహన్‌సింగ్‌కు నివాళి



కావలి: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాగా మన్మోహన్‌సింగ్ మృతిపై మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. మన్మోహన్ గొప్ప రాజనీతిజ్ఞుడని, విశిష్ట నాయకుడని కొనియాడారు. దూరదృష్టిగల, అసాధారణ రాజనీతిజ్ఞుడిని కోల్పోవడం విచారకరమని పేర్కొన్నారు.

నేత్రపర్వంగా జగన్నాథుని రథయాత్ర



పుష్పాలతో విశేషంగా అలంకరించి జగన్నాథుని రథం, (ఇన్‌సెట్లో) శ్రీగౌర-నితాయ్

కావలి: పట్టణంలో జగన్నాథుని రథయాత్ర శనివారం నేత్రపర్వంగా జరిగింది. ఇస్కాన్ నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై శ్రీగౌర–నితాయ్ (బలరామకృష్ణులు)ను కొలువుదీర్చి రథయాత్రను నిర్వహించారు. ట్రంక్‌రోడ్డులోని ఆర్‌ఎస్సార్ కల్యాణ మండపం నుంచి ఉత్తర శివారు ప్రాంతం వరకు రథయాత్ర శోభాయమానంగా సాగింది. రథయాత్రలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. భక్తుల భగవన్నామ స్మరణతో పట్టణం పులకించింది. రథయాత్రలో భక్తులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య, కోలాట ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, డీఎస్పీ శ్రీధర్, ఇస్కాన్ నిర్వాహకులు పాల్గొన్నారు.



కేరళ సంప్రదాయ నృత్య ప్రదర్శన



శాస్త్రీయ నృత్య ప్రదర్శన

ఎరువుల కొరత, అధిక ధరలను పట్టించుకోరా?



పీఆర్ ఏఈపై అగ్రహం వ్యక్తం చేస్తున్న వైఎస్ఎంపీపీ మాలకొండయ్య

ఉదయగిరి: యూరియా కొరతతో పాటు అధిక ధరలతో రైతులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోరా అంటూ గన్నేపల్లి సర్పంచ్ వెంకటస్వామి పాటు పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల సర్వసభ సమావేశాన్ని ఎంపీపీ మూలే పద్మజ అధ్యక్షతన శనివారం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఆర్‌బీకేలో రైతుల అవసరాల మేరకు ఎరువులు అందుబాటులో ఉండేవని తెలిపారు. ప్రస్తుతం యూరియా కొరత తీవ్రంగా ఉన్నా, అధిక ధరలకు విక్రయిస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. అలాగే పీఆర్ ఏఈ శ్రీనివాసరాజు విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని వైఎస్ఎంపీపీ జీ మాలకొండయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో జరిగే అభివృద్ధి పనులకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, పీపీ పద్మజాను శాలువాలతో సత్కరించారు. జెడ్పీటీసీ మోదీ రామాంజనేయులు, ఎంపీడీఓ అప్పాజీ, వైఎస్ఎంపీపీ మట్ల శాంతి, మూలే వినయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సంగం: గాంధీజనసంఘం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, సాంఘిక రుగ్మతల నియంత్రణపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సంగం ఎస్సై రాజేష్ మాట్లాడుతూ సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. హెడ్‌కానిస్టేబుల్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఆర్డీఓకు వినతి

కావలి: అగ్రహీరోల సినిమాల పేరుతో టికెట్ రేట్లను పెంచి ప్రేక్షకులను దోచుకోవడం దారుణమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి అన్నారు. అగ్రహీరోల సినిమాలకు టికెట్లను పెంచి వసూలు చేసుకునేందుకు ప్రత్యేక జీఓలను ఇవ్వొద్దని కోరుతూ కావలి ఆర్డీఓకు శనివారం ఆయన వినతిపత్రం అందజేశారు.

ప్రజారవాణాధికారి తనిఖీలు



ఆత్మకూరురూరల్: ఏపీఎస్ఆర్‌టీసీ నెల్లూరు జోనల్ ప్రజారవాణా అధికారి మురళీబాబు ఆత్మకూరు ఆర్టీసీ డిపోను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపోలోని బస్సుల రన్నింగ్ కండీషన్‌ను గ్యారేజీలోని బాధ్యులను అడిగి తెలుసుకున్నారు. బస్సు రోడ్డు టెస్ట్‌లో భాగంగా బైపాస్‌రోడ్డులో వాహనంలో ప్రయాణించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డిపో మేనేజర్ కరీమున్నీసా, ఏఎంఎఫ్ బాబురావు, సీఐ రాజ్‌కుమార్, గ్యారేజీ-3 మెకానిక్ విభాగాల బాధ్యులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి టోల్‌ప్లాజా వద్ద ఎస్సై శ్రీనివాసరావు శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి జరిమానాలు విధించారు. అలాగే సరైన పత్రాలు, ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనదారులకు జరిమానాలు విధించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్, కారు ప్రయాణికులకు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.